7

సాక్షి అనకాపల్లి

ఆదివారం । 23 । జూలై । 2023

న్యూస్‌రీల్

అభిమానులతో 'బ్రో'



సినీ హీరో సాయిధరమ్‌తేజ్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

పాయకరావుపేట: సినీ హీరో సాయిధరమ్‌తేజ్‌కు పట్టణంలో జాతీయ రహదారి పై తునికి చెందిన పలువురు భారీ పూలమాల వేసి తమ అభిమానం చాటుకున్నారు. బ్రో సినిమా ప్రమోషన్‌లో భాగంగా విశాఖపట్నం నుంచి అన్నవరం వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. తిరిగి ప్రయాణంలో పాయకరావుపేట తాండవ జంక్షన్ వద్ద అభిమానులు సాయిధరమ్‌తేజ్ వాహనాలను ఆపి ఆయనకు పూల మాల వేసి సత్కరించారు.

ప్రతి నెలా 983 గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'



రక్త పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కె.కోటపాడు: జిల్లాలో ప్రతి నెలా 983 గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో హేమంత్ తెలిపారు. చౌడువాడ పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 39 వాహనాల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రోగులకు 14 రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు 105 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. పీహెచ్‌సీల్లో రోగులకు 65 రకాల పరీక్షలతో పాటు 172 రకాల మందులు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

వర్షాలు కురిస్తే ఖరీఫ్ ఆశాజనకం

అనకాపల్లి టౌన్: ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే ఖరీఫ్ సీజన్ ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం జరిగిన టీ అండ్ వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గతనెల 83 శాతం, ఈ నెలలో 53 శాతం తక్కువ వర్షపాతం కురిసిందని, ఖరీఫ్ సీజన్‌కు నేటి వరకు 50 నుంచి 60 శాతం లోటు ఉందన్నారు. రాబోయే 15 రోజుల్లో వర్షాలు కురిస్తే ఖరీఫ్ ఆశాజనకంగా ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు మాట్లాడుతూ వరినారు మడులను ఆశించిన పాము పొడ తెగులు, ఎరువుల యాజమాన్యం, చెరకు పంటలో సంస్యరక్షణ చర్యల గురించి వివరించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు, ఆత్మ పీడీ ఆశాదేవి పాల్గొన్నారు.

బొమ్మల కొలువు

SUNDAY SPECIAL

- ఖండాంతరాలు దాటిన ఏటికొప్పాక ఖ్యాతి
- అంకుడు కర్రలతో అద్భుత ఆవిష్కరణలు
- హస్తకళాకారులకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు
- మన్‌కీ బాత్‌లో ప్రస్తావించిన ప్రధాని మోదీ
- సీవీ రాజుకు పద్మశ్రీ పురస్కారం
- డాక్యుమెంటరీతో నీలిమకు ప్రపంచంలో రెండో స్థానం



కళ్లకు కట్టినట్టు పెళ్లి తంతు

అనకాపల్లి రూరల్/యలమంచిలి: ఏటికొప్పాక.. ఒకప్పుడు చిన్న గ్రామం. ఇప్పుడు ఖండాంతర ఖ్యాతిని ఆర్జించిన సందర్శనీయ స్థలం. అపురూపమైన హస్తకళకు మారుపేరుగా నిలిచింది. అంకుడు కర్రతో అద్భుతాలను సృష్టించగలరు ఇక్కడి కళాకారులు. సహజసిద్ధమైన రంగులను అద్ది, లక్కబొమ్మలతో నమ్మశక్యం కాని కళాఖండాలను తయారు చేయగల నైపుణ్యం వీరి సొంతం. అందుకే జాతీయ, అంతర్జాతీయ గుర్తింపుతోపాటు ఇటీవల కేంద్ర ప్రభుత్వ పద్మశ్రీ పురస్కారం కూడా లభించింది. తాజాగా విశాఖకు చెందిన ప్రొఫెసర్ బొగాది నీలిమ ఏటికొప్పాక హస్తకళా నైపుణ్యంపై 'సాగా ఆఫ్ ది విమెన్' పేరిట డాక్యుమెంటరీ తీసి, ప్రపంచంలో రెండో స్థానం కైవసం చేసుకున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల ఆన్‌లైన్ అమ్మకాలతో ఈ లక్కబొమ్మలకు మంచి మార్కెట్ సమకూర్చేందుకు అధికారులు చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. ఇటీవల జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ట్రైనీ కలెక్టర్ ధాత్రిరెడ్డి తదితర అధికారులు ఏటికొప్పాక హస్తకళాకారుల నైపుణ్యతను పరిశీలించారు. సహజసిద్ధమైన రంగులతో మరిన్ని బొమ్మలు తయారు చేయడంలో మహిళలకు ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. రంగులు అద్దేందుకు అవసరమైన రెండు యంత్రాలను కూడా సమకూరుస్తున్నారు.

ప్రతి బొమ్మా అపురూపమే..

పిల్లలు ఆడుకునే బొమ్మలు, మహిళలు ధరించే గాజులు, కుంకుమ భరిణెలు, కీ చెయిన్లు, ఫ్లవర్‌వాజ్‌లు, దేవతామూర్తుల బొమ్మలు, గ్రామీణ వాతావరణం, రామాంజనేయ యుద్ధ సన్నివేశాలు, పెళ్లి తంతు.. ఇలా ఒకటేమిటి సమస్త జీవన సారం ఏటికొప్పాక బొమ్మల్లో రూపుదాలుస్తుంది. కళాఖండాలు సృష్టించిన హస్తకళాకారులను ఎన్నో అవార్డులు వరించాయి. శ్రీశైలపు చిన్నయాచారికి 2005లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా జాతీయ అవార్డు లభించింది. సాధారణ కోడిగుడ్డు సైజులో 32 గుడ్లు ఇమిడి ఉండేలా చిన్నయాచారి తయారు చేసిన కళాఖండానికి తొలిసారిగా జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఆ తర్వాత పెదపాటి ఆనందాచారి, పెదపాటి శరత్,





లక్కోజు త్రిమూర్తులు, కొత్తలి శ్రీను కూడా వివిధ అవార్డులను సొంతం చేసుకున్నారు. గిన్నిస్‌బుక్, లిమ్కాబుక్‌లలో కూడా ఏటికొప్పాక కళాకారులు చోటు సంపాదించుకున్నారు. ఈ గ్రామానికి చెందిన హస్తకళాకారుడు సీవీ రాజుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ప్రధాని మోదీ కూడా మన్‌కీ బాత్‌కార్యక్రమంలో ఏటికొప్పాక పేరును ప్రస్తావించడం విశేషం.

ఖండాంతరాలు దాటిన లక్కబొమ్మ

దేశ, విదేశాల్లో ప్రాచుర్యం పొందిన ఏటికొప్పాక బొమ్మలు ఢిల్లీ, చెన్నై, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్, భువనేశ్వర్, రాజస్థాన్, పాట్నా నగరాలతో పాటు అమెరికా, శ్రీలంక, ఆస్ట్రేలియా, పోలండ్, హాలెండ్, స్విట్జర్లాండ్, నేపాల్, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలకు బొమ్మలు ఎగుమతి అవుతున్నాయి. ఏటికొప్పాకలో సుమారు ఏడు దశాబ్దాల కిందట 4 విశ్వకర్మ కుటుంబాలు లక్కబొమ్మల తయారీని చేపట్టగా.. ఇప్పుడు బొమ్మలు తయారు చేస్తున్న కుటుంబాలు దాదాపు 150 వరకూ వున్నాయి. ఒకప్పుడు రూ.400కు దొరికే అంకుడు కర్రల మోపు ఇపుడు రూ.4 వేలకు పెరిగిందని, అంకుడు కర్ర డిపోను ఏర్పాటు చేస్తే తమకు ఉపయుక్తంగా ఉంటుందని కళాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సహజసిద్ధమైన రంగులే ప్రత్యేకత

ఏటికొప్పాక లక్కబొమ్మలకు అద్దే రంగులన్నీ సహజసిద్ధమైనవే. రంగుల తయారీ కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఉమ్మడి విశాఖ గిరిజన ప్రాంతాలైన కొయ్యూరు, కేడీపేట సమీపంలో లభ్యమయ్యే జాఫ్రా అనే కాయల్లో ఉండే ఎర్రని పిక్కల నుంచి ఎరుపు రంగు మిశ్రమాన్ని తయారుచేస్తారు. వేసవికి ముందు మాత్రమే ఎక్కువగా లభించే ఈ పిక్కల్ని పెద్ద మొత్తంలో ఇక్కడి కళాకారులు గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తారు. వీటిని నీటిలో నానబెట్టి అధిక ఉష్ణోగ్రత వద్ద బాగా మరిగిస్తే ఆరెంజ్ రంగు ముద్దగా మారుతుంది. దీనిలో వేడి చేసిన లక్కను కలిపితే మోతాదును బట్టి ఎరుపు తదితర నాలుగు రంగులు వస్తాయి. ఇనుప ముక్కల్ని, నల్ల బెల్లాన్ని ఒక పెద్ద పాత్రలో నెలరోజులు ఉంచితే నీరు నల్లగా మారుతుంది. ఇందులో కరక్కాయ తొక్కలను బాగా మరిగించగా వచ్చిన కషాయంతో కలిపి మళ్లీ వేడి చేస్తే నల్లటి పేస్టు వస్తుంది. కరిగించిన లక్క ముద్దలో ఈ పేస్టుని కలిపితే నల్ల రంగు వస్తుంది. పసుపు కొమ్ముల పొడిని కరిగించిన లక్కలో మిక్స్ చేస్తే పసుపు వర్ణం తయారవుతుంది. ఇండిగో ప్లాంట్ కొమ్మల నుంచి నీలం రంగు, ఆకుపచ్చ వర్ణం తయారు చేస్తారు.



ఆకస్మిక తనిఖీలు.. అక్షింతలు

- పలు పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- లోటుపాట్లు గుర్తింపు.. అధికారులకు మందలింపు



యలమంచిలిలో విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్ ప్రకాష్



అమలాపురం ప్రాథమిక పాఠశాలలో వర్క్ బుక్ దిద్దుబాటుపై ప్రశ్నిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

నక్కపల్లి, యలమంచిలి, ఎస్.రాయవరం: విద్యారంగానికి ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.. నాడు నేడు పథకానికి రూ.13 వేల కోట్లు విడుదల చేశాం.. ఉపాధ్యాయులు, అధికారులు అందుకు అనుగుణంగా మరింత శ్రద్ధగా పనిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. నక్కపల్లి, యలమంచిలి, ఎస్.రాయవరం మండలాల్లో పలు పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన లోటుపాట్లను గుర్తించి.. డీఈవో, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులను మందలించారు. నక్కపల్లి మండలంలో అమలాపురం, రాజయ్యపేట పాఠశాలలను, నక్కపల్లి కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మోకాళ్లపై నిలుచొని చిన్నారులను పలు ప్రశ్నలడిగారు. అమలాపురం ప్రాథమిక పాఠశాలలో వర్క్ బుక్‌లో విద్యార్థి తప్పు రాస్తే ఉపాధ్యాయుడు రైట్ మార్క్ వేయడాన్ని గుర్తించి మందలించారు. అదే మండలంలోని రాజయ్యపేట హైస్కూల్లో తరగతి గదిలో విద్యుద్దీపం వెలగకపోవడాన్ని గుర్తించి.. నాడు నేడు పనులు పర్యవేక్షిస్తున్న ఏఈ ప్రసాద్‌పై మండిపడ్డారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులు కరెక్షన్ చేయనందున సాయంత్రానికల్లా వాటిని దిద్ది తనకు వాట్సాప్‌లో పెట్టి తిరిగి ఆ పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపించాలని డీఈవో మహాలక్ష్మమ్మను ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు పాఠశాలల నిర్వహణ ఎలా సాగుతోందని వాకబు చేస్తారని ఆయనకు ఏం సమాధానం చెప్పాలని ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలో స్టూడెంట్ సర్వే సరిగా జరగడం లేదని గుర్తించి సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొరవడిన పర్యవేక్షణ

యలమంచిలిలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్, తులసీనగర్‌లో ఉన్న బాలికల హైస్కూల్, కళాశాలను ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. ట్యాబ్‌ల ద్వారా బైజూస్ పాఠాలను అందిస్తుంటే విద్యార్థులు వాటిని వినియోగించుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం పాఠశాలలో వర్క్ బుక్స్ తనిఖీ చేశారు. నాలుగో తరగతి విద్యార్థి సోషల్ వర్క్ బుక్ తప్పు రాసినా ఉపాధ్యాయుడు రైట్ కొట్టాడని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఆర్‌జేడీ జ్యోతికుమారి, టెక్స్ట్‌బుక్స్ రాష్ట్ర డైరక్టర్ రవీంద్రరెడ్డి, ఆర్డీవో జయరామ్ పాల్గొన్నారు.

వేచలంలో భారీ చోరీ

- 29.50 తులాల బంగారం, రూ.12.95 లక్షల నగదు అపహరణ
- 15వ తేదీ అర్ధరాత్రి దొంగతనం
- నిందితుడి అరెస్టు, కొంత సొత్తు స్వాధీనం



ఇంట్లోకి చొరబడేందుకు పగలకొట్టిన కిటికీ అద్దాలు, గ్రిల్స్

దేవరాపల్లి: మండలంలోని వేచలంలో ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగింది. గ్రామ శివారు అచ్చన్న వారి కల్లాలులో ఒంటరిగా నివసిస్తున్న అల్లు గోవింద ఇంటిలో వారం రోజుల కిందట 29.50 తులాల బంగారం, రూ.12.95 లక్షల నగదు చోరీ జరిగింది. బంగారం, నగదును రికవరీ చేసేందుకు చోరీ విషయాన్ని గోప్యంగా ఉంచాల్సి వచ్చిందంటూ పోలీసులు చెబుతున్నారు. కె.కోటపాడు పోలీసుస్టేషన్ కేంద్రంగా గోప్యంగా విచారణ చేపట్టారు. ఈ విషయం శనివారం బయటకు పొక్కడంతో ఎస్‌ఐ డి.నాగేంద్ర వద్ద చోరీ విషయాన్ని స్థానిక విలేకరులు ప్రస్తావించారు. దొంగతనం జరిగిన మాట వాస్తవమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేచలానికి చెందిన అవివాహితుడైన అల్లు గోవింద దుర్గాదేవి భక్తుడు. కె.కోటపాడు మండల రొంగలినాయుడుపాలెంలోని దుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రుల సమయంలో బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేస్తాడు. వంటలు చేయడం ద్వారా వచ్చిన సొమ్ముతో కొనుగోలు చేసిన 29.50 తులాల బంగారు ఆభరణాలను తన ఇంటిలో కప్‌బోర్డులో భద్రపరిచాడు. రూ.2.95 లక్షల నగదుతో పాటు తన సొంత అవసరాలకు విశాఖకు చెందిన సన్నిహితుల నుంచి అప్పుగా తీసుకున్న రూ.10 లక్షల నగదును ఇంటిలో ఉంచాడు. గోవింద దగ్గర పనిచేసి, నెల రోజుల కిందట పని మానేసిన వేచలపు నాగేష్‌కు గోవింద ఇంటిలో ఎక్కడెక్కడ బంగారం, నగదు ఉందో తెలుసు. గోవింద ఇంటి దగ్గర లేని సమయం చూసి ఈ నెల 15వ తేదీ రాత్రి కిటికీ ఇనుప గ్రిల్‌ను తొలగించి లోపలికి ప్రవేశించాడు. దొంగతనం జరిగిన మరుసటి రోజు ఉదయం అటుగా వచ్చిన ఓ వ్యక్తి ఇంటి గ్రిల్ తొలగించి ఉన్న విషయాన్ని గోవింద్‌కు ఫోన్‌లో తెలియజేశాడు. గోవింద ఇంటికి వచ్చి చూడడంతో చోరీ జరిగిన విషయం బయటపడింది. బాధితుడు ఈనెల 16న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. అనుమానితులను విచారించగా దొంగతనాన్ని తానే చేసినట్టుగా వేచలపు నాగేష్ అంగీకరించాడని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి నుంచి రూ.2,22,500 నగదు, చోరీ సొమ్ముతో కొనుగోలు చేసిన స్మార్ట్‌ఫోన్, ద్విచక్రవాహనాన్ని రికవరీ చేశామని, మిగిలిన నగదుతో పాటు బంగారు ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉందన్నారు. చోడవరం కోర్టులో నిందితుడిని శుక్రవారం హాజరు పరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు తెలిపారు. జైలులో ఉన్న నాగేష్‌ను కోర్టు అనుమతితో బయటకు తీసుకువచ్చి మరింత లోతుగా విచారణ చేస్తామని ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

25 టేకు దుంగల స్వాధీనం

గొలుగొండ : సాలిక మల్లవరం గ్రామంలో ఇంటి వద్ద అనుమతులు లేకుండా నరికి ఉంచిన 25 టేకు దుంగలను అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని ఇంటి యజమాని శ్రీను ఐదు టేకు చెట్లను నరికి ఇంటి వద్ద ఉంచడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నం సెక్షన్ అధికారి రమణ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. కలప విలువ రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా వేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని సెక్షన్ అధికారి రమణ తెలిపారు.

ముగ్గురు హిజ్రాలపై కేసు నమోదు

అనకాపల్లిటౌన్ : తులంన్నర బంగారం గొలుసుని దొంగలించిన ముగ్గురు హిజ్రాలపై రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు కథనం మేరకు వివరాలివి. మండలంలో సీతానగరం హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ఎం.కిరణ్‌కుమార్, స్నేహితుడు దత్తాచార్యలు ద్విచక్రవాహనంపై సీతానగరం నుంచి బొజ్జన్నకొండ మీదగా విశాఖ వెళుతున్నారు. బొజ్జన్నకొండ వద్ద ముగ్గురు హిజ్రాలు వాహనాన్ని ఆపారు. వారికి నగదు ఇస్తున్న సమయంలో కిరణ్‌కుమార్ మెడలో ఉన్నతులంన్నర బంగారం గొలుసు దొంగలించారని, ఈమేరకు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు విస్తరణకు మేం ఓకే...

- ముందుకు వస్తున్న భవన యజమానులు
- అంగీకార పత్రాలు అందజేసిన వైనం

నర్సీపట్నం : నర్సీపట్నంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావడంతో విస్తరణకు భవన యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అభివృద్ధికి అడ్డు పడకూడదనే ఉద్దేశ్యంతో కోర్టును ఆశ్రయించిన కొంత మంది భవన యజమానులు సైతం విస్తరణకు అంగీకారం తెలుపుతున్నారు. రోడ్డు విస్తరణకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసు వేసిన సాయి సంపద హోమ్‌నీడ్స్ యజమాని వెంకట్‌రెడ్డి రోడ్డు విస్తరణపై తనకు అభ్యంతరంలేదని స్వయంగా వచ్చి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో మున్సిపల్ కమిషనర్ కనకారావుకు నిరభ్యంతర పత్రాన్ని అందజేశారు. అలాగే సీఎంఆర్ భవన యజమాని ప్రసాద్, అడపా డిజిటల్ ఓనర్ రాజు తదితరులు కమిషనర్‌కు నిరభ్యంతర పత్రాలను అందజేశారు. ఈ విధంగా ఒక్కొక్కరుగా స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఎమ్మెల్యే సమక్షంలో మున్సిపల్ అధికారులకు నిరభ్యంతర పత్రాలను అందజేస్తున్నారు. రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న భవన యజమానులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. రోడ్డు విస్తరణ బాధితులు 233 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే వంద మందికి పైగా భవన యజమానులు నిరభ్యంతర పత్రాలను అందజేశారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు ఊపందుకోనున్నాయి.



ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో నిరభ్యంతర పత్రాన్ని కమిషనర్‌కు అందజేస్తున్న భవన యజమానులు

ఇరువర్గాల నడుమ వైషమ్యాలు వద్దు..

దళిత సంఘాలకు వివరించిన కాపు సంఘాల నేతలు

రావికమతం : ఒక రౌడీ షీటర్ భూ దందా కోసం రెండు అట్రాసిటీ కేసులు పెట్టడం రెండు సామాజిక వర్గాల నడుమ చిచ్చురేపింది. దీంతో ఇరువర్గాల నాయకులు శుక్రవారం రాత్రి బజారు వీధిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశమయ్యారు. కాపు సంఘం నాయకులు గర్రెడ్డి శ్రీను, దేముళ్లు, సోమిరెడ్డి రాజు, బాబూరావు ఒక వినతి పత్రాన్ని దళిత సంఘం,అంబేడ్కర్ సంఘం నేతలు మల్లేటి రాజు, కాగిత గంగరాజు, టొల్లల శేఖర్, పూడి అప్పారావు, దేవ, పూతి అప్పారావు లకు అందించారు. కొత్తకోటలో సర్వే నంబరు 185లో ఒక సెంటుంపావు భూమిని మరువాడ అర్జున వద్ద అదే గ్రామానికి చెందిన గరగా మాణిక్యం 19 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారని, ఆ భూమిని దొండపూడి గ్రామానికి చెందిన కొరతల రాజా రమేష్‌కు మాణిక్యం భార్య సత్యవతి పదేళ్ల క్రితం విక్రయించిందన్నారు. అయితే గ్రామానికి చెందిన రౌడీ షీటర్ ఆ స్థలంపై కన్నేసి ఆక్రమించాలని చూశాడని, దీనికి ప్రతిఘటన ఎదురవడంతో మరువాడ సత్యనారాయణతో ఆ స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించడమే కాక రమేష్ ,శేషుపై తప్పుడు అట్రాసిటీ కేసు పెట్టించాడన్నారు. అది వీగిపోవడంతో మళ్లీ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా దీనిపై తహసీల్దార్ మహేశ్వరరావు ఈ నెల 14న ఇరువర్గాలను విచారించారు. ఈ క్రమంలో రౌడీషీటర్ రమణ సత్యవతిపై దుర్భాషలాడగా ఆమె రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రమణ కూడా సత్యవతితో పాటు, రమేష్, శేషుపై మరో అట్రాసిటీ కేసు పెట్టించాడని దళిత నేతలకు వివరించారు. ఈ కేసుల వల్ల రెండు కులాల నడుమ వైషమ్యాలు రాకూడదన్నారు. దీంతో గతంలోనూ రమణను హెచ్చరించినా తీరుమారలేదని, అతని స్వార్థ ప్రయోజనాలకు తాము మద్దతివ్వబోమని దళిత సంఘాల నేతలు చెప్పారు. ఎప్పటిలా అన్నదమ్ముల్లా కలిసి ఉందామని ఇరువర్గాలు నిర్ణయించారు.



దళిత సంఘాల నేతలతో సమావేశమైన కాపు సంఘాల నేతలు

ప్రేమించి మోసగించిన యువతికి రిమాండ్

అనకాపల్లిటౌన్ : ప్రేమించి మోసం చేసిన సంధ్యకు శనివారం న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పట్టణ సీఐ దాడి మోహనరావు చెప్పారు. వివరాలివి. ప్రేమ విఫలమైందని ఈనెల 20వ తేదీన స్థానిక గాంధీనగరం అజయ్యకాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కె.కుమార్ మృతిచెందిన విషయం విదితమే. మృతుడు తండ్రి తౌడయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతుడి ప్రియురాలు సంధ్య, ఆమె తల్లిదండ్రులు సత్యవతి, శ్రీను, మేనమామ హనుమంతరావులను శనివారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి సంధ్యకు 14రోజులు రిమాండ్ విధించారని, సత్యవతి, శ్రీను, హనుమంతరావులకు బెయిల్ మంజూరు చేసినట్టు సీఐ చెప్పారు. సంధ్యను విశాఖ కేంద్ర కారాగారానికి తరలించడం జరిగిందన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : ద్విచక్రవాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేస్తున్న పల్లెల గణేష్ (31) విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ సింహాచలం తెలిపిన వివరాలివి. గవరపాలెం కొణతాల దుర్గనాయుడు వీధికి చెందిన గణేష్ ఉడ్‌పేట పాఠశాల ఎదురుగా ప్రైవేట్ వాటర్ సర్వీసింగ్‌లో పనిచేస్తున్నాడు. ద్విచక్రవాహనానికి వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేశాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఒక పాప, బాబు ఉన్నట్టు తెలిపారు.

వృద్ధుడి మృతి

అనకాపల్లిటౌన్: స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల సమీపంలో ఓ వృద్ధుడు శనివారం మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ సింహాచలం కథనం మేరకు వివరాలివి. కళాశాల సమీపంలో హైదరాబాద్‌కు చెందిన జోషఫ్ అనే వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండి మృతి చెందినట్టు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

అనకాపల్లిటౌన్: మండలంలోని బవులవాడ, తగరంపూడి గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు కొండుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

అనకాపల్లిటౌన్: కొండుపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని, ఉదయం ఏడు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లి బాబు

కశింకోట: స్థానిక కంచిపాటి వీధి నుంచి సతకంపట్టు రామాలయం వరకు రూ.20 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో కంచిపాటి వీధి నుంచి కోమటి వీధి, బాలుర ప్రాథమిక పాఠశాల నుంచి సతకంపట్టు రామాలయం వరకు ఈ రోడ్డు, కాలువలు నిర్మించనున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. పనులు నిర్వహిస్తున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

నేడు పూర్వ విద్యార్థుల కలయిక

అనకాపల్లిటౌన్: స్థానిక జార్జిక్లబ్ ప్రాంగణంలో ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 21 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,010	4,010
మూడోరకం	------	------

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
హిడింబ	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
హత్య	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
కార్తీక	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ నెగిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-5 యూనిట్లు, బి నెగిటివ్-2యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్‌ను 9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 367 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

జోరుగా ఊళ్ల నిర్మాణం



హంగులతో నిర్మించిన నూతన గృహం



శంకరం జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణాలు

- డిసెంబర్ నాటికి జగనన్న లేఅవుట్లలో గృహాల పూర్తికి ప్రణాళిక

తుమ్మపాల: పేదవాడి సొంతింటి కలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది నవరత్నాల్లో భాగమైన వైఎస్సార్ జగనన్న-పేదలందరికీ ఇళ్ల పథకం. పేద, మధ్యతరగతి, ధనిక వర్గాల్లో ఎవరికైన సొంతింటిని నిర్మించుకోవాలని కల ఉంటుంది. ధనిక, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఏదోవిధంగా గృహాలను నిర్మించుకుంటున్నారు. కానీ పేదవాడికి మాత్రం సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలకు శ్రీకారం చుట్టి సొంత గూడుతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కళ్లలో ఆనందాన్ని నింపుతున్నారు. ప్రతి పేదవాడు సొంతింటిని నిర్మించుకోవాలి, సమాజంలో ప్రతి పేదవాడికి గుర్తింపు ఉండాలనే కృతనిశ్చయంతో జగనన్న లేఅవుట్లు ఏర్పాటుచేసి ఏకంగా కొత్త ఊళ్లనే నిర్మిస్తున్నారు.

48 లేఅవుట్లు...

మండలంలో 31 గ్రామ పంచాయతీలకు గాను 48 జగనన్న లేఅవుట్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రభుత్వ స్థలాలు లేని కొన్ని చోట్ల ప్రైవేటు భూములు కొనుగోలు చేసి పేదల కోసం లేఅవుట్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 3,082 గృహాలు మంజూరు చేశారు. కరోనా, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మందకొడిగా సాగిన ఇళ్ల నిర్మాణం ఇప్పుడిప్పుడే వేగంగా సాగుతున్నాయి. దాదాపు 2,317 ఇళ్ల నిర్మాణాల పనులు పునాదులు, ఆపై స్థాయిలో ఉన్నాయి. 120 వరకు శ్లాబులు పూర్తవగా, ఇప్పటికే 467వరకు గృహాల్లో లబ్ధిదారులు ప్రవేశించి నివాసముంటున్నారు. రానున్న రెండు మూడు నెలల్లో మరో 300 గృహాలను ప్రారంభించేందుకు లబ్ధిదారులు సిద్ధపడుతున్నారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో వేగంగా పనులు జరిగి డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

మండలంలో ఇళ్ల నిర్మాణాల పురోగతి ఇలా..	
బేస్‌మెంట్ లోపువి	1,251
బేస్‌మెంట్ లెవెల్	1,066
రూఫ్ లెవెల్	153
రూఫ్ పూర్తి	120
పనులు ప్రారంభం కానివి	25
పూరయినవి	467
మొత్తం	3082

జగనన్న లేఅవుట్లలో మౌలిక సౌకర్యాలు

వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ తదితర మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు వెచ్చించింది. ఆయా శాఖల అధికారులు క్రమపద్ధతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గృహనిర్మాణాల పనుల కోసం ఇప్పటికే అన్ని గ్రామాల్లో లేఅవుట్ల వద్ద బోర్లు వేశారు. నిర్మాణపనులు ప్రారంభించిన ప్రతి ఇంటి వద్ద కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటుచేశారు. దాదాపు 25 గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థను పూర్తిచేశారు. పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం అందుబాటోకి తీసుకొచ్చారు. అధికార యంత్రాంగం రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది.

త్వరితగతిన గృహ నిర్మాణాలు



జగనన్న కాలనీలను డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నాం. నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు వేగంగా పేమెంట్ చెల్లిస్తున్నాం. గృహానికి అవసరమయ్యే ఇనుము, సిమెంట్, ఇసుకతో పాటు డోర్లు, కిటీకీలు వంటి వుడ్ వర్క్ సామగ్రి కూడా ప్రభుత్వం అందిస్తోంది. ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలతో పాటు డ్వాక్రా మహిళకు రూ.35 వేలను ప్రభుత్వం రుణంగా అందిస్తోంది. పనులు ప్రారంభించని నిరుపేదలకు అడ్వాన్స్‌గా రూ.20 వేలు ఇస్తున్నాం.

– కొణతాల మురళీ, ఏఈ, గృహనిర్మాణ శాఖ, అనకాపల్లి మండలం

అజొల్లాతో అధిక దిగుబడి

కశింకోట: వరి పొలాల్లో అజొల్లా నాచు గడ్డి వేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా ఇన్‌చార్జి టి. శ్యామల అన్నారు. మండలంలోని జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శనివారం అజొల్లా విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అజొల్లా విత్తనం నీటిలో పెరుగుతుందని, దీన్ని వరి పొలంలో వేసి పెంచడం వల్ల ఎరువుగా ఉపయోగపడనుందన్నారు. దీన్ని ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి సాగు చేసే రైతులకు సరఫరా చేయాలన్నారు. ఎకరాకు 5 నుంచి 8 కిలోల వరకు దీన్ని వేయాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల వరికి నత్రజని అందుతుందని, ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. పశువులకు, కోళ్లకు మేతగా కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. పశువులు పాలు ఎక్కువగా ఇవ్వడంతోపాటు వెన్న శాతం పెరుగుతుందన్నారు. కోళ్లు బాగా ఎదిగి మాంస ఉత్పత్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి డి.రమణ, సిబ్బంది వి.లక్ష్మి, కె.దేవి తదితరులు పాల్గొన్నారు.



అజొల్లా విత్తనాలను అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా ఇన్‌చార్జి శ్యామల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అనకాపల్లిటౌన్: అర్హులైన అందరికీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, మరోసారి ఆయనను సీఎం పీఠంపై కూర్చోబెట్టే బాధ్యత మనందరిపై ఉందని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. 5,6 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గుండాల జంక్షన్ జీవీఎంసీ కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు రమేష్, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధ్రువీకరణ పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరగవలసి వచ్చేదని చెప్పారు. 83వ వార్డు పరిధిలో కోట్లాది రూపాయలతో రహదారులు, డ్రైనేజీలు, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలు, నూతన సచివాలయాల భవనాలు నిర్మించినట్టు తెలిపారు. అనంతరం 1008 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఎస్.వెంకటరమణ, డీటీ వై.శ్రీరామమూర్తి, డీఈ వేణుగోపాల్, జీవీఎంసీ ఏపీడీ వి.కె.దొర, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ అంట్యాకుల రత్నకుమారి, మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్ధ భాస్కర రావు, గంటా సముద్రాలు, రాయవరపు జోగిరాజు, కొడుకుల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

నేత్రపర్వంగా గోదాదేవికి ప్రత్యేక పూజలు

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారి తిరు నక్షత్ర కార్యక్రమం శనివారం నేత్ర పర్వంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు అర్చకులు కృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకం తీర్థగోష్టి, ప్రసాద నివేదన నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు వేంకట శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బాగవతం గోపాలాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాల అలంకరణ చేసి నావారా దివ్యప్రబందం సేవాకాలము నిర్వహించారు. కుంకుమార్చన విశేష పూజలు నివేదనలు, తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం వెయ్యిమందికి అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో సిబ్బంది గురవయ్య మహేష్ ,హెటిరో ప్రతినిధి సీతారామాచార్యులు పాల్గొన్నారు.



గోదాదేవి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా అమ్మవారి తిరునక్షత్రం పూజలు



ఆండాళ్ళు అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీ రాధారుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానంలో తిరునక్షత్రం సందర్భంగా ఆండాళ్ళు అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం నూతన వస్త్ర అలంకరణ, అర్చన బాల భాగీతం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.వెంకటాద్రి పర్యవేక్షణలో పండితులు కృష్ణస్వామి, నారాయణాచార్యులు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

27న 'కొబ్బరిచెక్కల' వేలంపాట

అనకాపల్లిటౌన్: దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని గవరపాలెం సంతోషిమాత ఆలయంలో కొబ్బరి చెక్కల కోసం ఈనెల 27వ తేదీ ఉదయం 10గంటలకు టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకూ కొబ్బరి చెక్కలు పోగు చేసుకునేందుకు లైసెన్సు హక్కు కోసం వేలంపాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పాటలో పాల్గొన దలచిన వారు ప్రథమ ధరావత్తుగా రూ.5వేలు చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9296350731 అనే ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా ఓటర్ల వెరిఫికేషన్



తీడలో ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

కశింకోట: ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ సిబ్బందిని ఆదేశించారు. కశింకోట, తీడ గ్రామాల్లో ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తప్పుగా, అదనంగా నమోదైన ఓటర్లు, మృతుల పేర్లను జాబితాల నుంచి తొలగించాలని, 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించాలని ఆదేశించారు. నెల రోజులపాటు జరిగే కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమెన్ చాందికి ఘన నివాళి

కశింకోట: కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యుడు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, నియోజక వర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తి, సత్యనారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సేనాపతి రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సూరిశెట్టి ఆదిబాబు, మండల బీసీ సెల్ నాయకుడు మాడెపు నాయుడు,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పీలా జగ్గఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



మినరల్ వాటర్ మిషన్ అందజేస్తున్న పోర్టు పాఠశాల పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం:విశాఖపట్నం పోర్టు పాఠశాల పూర్వ విద్యార్థులు ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.40 వేలు విలువ చేసే సామగ్రిని శనివారం అందజేశారు.హెల్పింగ్ హేండ్స్ సొసైటీ పేరుతో విద్యార్థులకు సహాయం అందచేస్తున్నట్టు సొసైటీ ప్రతినిధులు చక్రవర్తి,రేణుక,సుజాత, భాస్కరరావు అన్నారు. పాఠశాలకు అవసరమైన మెగా ఫోన్, మినరల్‌వాటర్ ప్లాంట్ తదితర వస్తువులు అందజేశారు. సర్పంచ్ శ్రీరాములు ,హెచ్ఎం రాజారావు, ఉపాధ్యాయులు జాన్‌మెతుషలా పాల్గొన్నారు.

రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులు

- ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి



ఇందిరా కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి

కశింకోట: స్థానిక ఎస్సీ ప్రాంతాల్లో రూ.1.15 కోట్ల ఎంపీ కోటా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, ఈ మేరకు నిధులు మంజూరు చేసినట్టు అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి తెలిపారు. స్థానిక హౌసింగ్ కాలనీ, ఇందిరా కాలనీలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా కాలనీల్లో రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తామన్నారు. ఇందిరా కాలనీలో రూ.50 లక్షలతో అంబేడ్కర్ సామాజిక భవనాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. హౌసింగ్ కాలనీలో రూ.5 లక్షలతో చిన్న రెల్లి సామాజిక భవనాన్ని కూడా నిర్మిస్తామన్నారు. సాధుమఠంలో శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కశింకోటలో గతంలో ఏడు బోర్లను ఎంపీ నిధులతో ఏర్పాటు చేశామన్నారు.మండలంలో 11 శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వీటిలో ఆరింటి పనులు పూర్తి అయ్యాయన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద



బాలింతలకు సలహాలిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

కశింకోట: స్థానిక గవరపేటలో శనివారం హెల్త్ క్లినిక్ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 103 మంది వైద్య సేవలు పొందారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వై.యశోద రోగులను పరీక్షించి , ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్పర్శలేని మచ్చలు శరీరంపై ఉంటే కుష్టు వ్యాధిగా అనుమానించాల్సి ఉంటుందని, మచ్చలు ఏర్పడితే వైద్యులను సంప్రదించి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం కుష్టు వ్యాధి నిర్ధారణకు తమ ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే జరుపుతున్నారన్నారు. సర్వేలో అనుమానితులను గుర్తించి వ్యాధి నిర్ధారణకు ఉన్నత వైద్యులకు సిఫారసు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు, వైద్యసలహాలు అందజేశారు. హెల్త్ క్లినిక్ అధికారి దుర్గ, హెల్త్ అసిస్టెంట్ సుభాని, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణిత క్లబ్‌లతో విద్యార్థుల్లో అవగాహన పెంపు



'పై 'విలువ కనుగొనే పద్ధతులను వివరిస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత శాస్త్రానికి చెందిన 'పై' (22/7) అంచనా విలువ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'పై' విలువను కనుగొనే 15 పద్ధతుల నమూనాలను తయారు చేసి విద్యార్థులు తమ సహచర విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఎ.వి.ఎస్ మూర్తి మాట్లాడుతూ పాఠశాలల్లో గణిత క్లబ్‌లను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన, సామర్థ్యం పెరుగుతుందన్నారు. హెచ్ఎం జి.వి.కె.ఆచారి మాట్లాడుతూ నమూనాలను స్వయంగా చేయడం ద్వారా విద్యార్థులు గణితం అభ్యసించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వి.సత్యనారాయణమూర్తి, విజయ్, సోమరాజు, విజయలక్ష్మి, సత్యవేణి,నూకరాజు, సబితలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు తహసీల్దార్ కార్యాలయం రహదారిలో కశింకోట, కూండ్రం, కుంచంగి, బయ్యవరాలకు చెందిన ఆటో డ్రైవర్లకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలను రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అధిక లోడ్‌తో ప్రయాణం చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డుల తమ వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఆటోలో అనుమానిత వ్యక్తులు ఎవరైన ప్రయాణిస్తే తక్షణమే దగ్గరలోఉన్నపోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ పాల్గొన్నారు.

కోలాటాన్ని గుర్తించాలి



కోలాటం మహిళలకు సర్టిఫికెట్లు అందసేస్తున్న కాండ్రేగుల వెంకటరమణ, మహేశ్వరరావు

తుమ్మపాల: సంప్రదాయ, సాముహిక ఆట కోలాటం ప్రదర్శనలను గుర్తించాలని ప్రభుత్వానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. స్థానిక గవరపాలెంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహించిన యువ ఉత్సవ్-2023లో కోలాటం ప్రదర్శించిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల, ఆట అనే రెండు పదాల కలయిక కోలాటం అని, కోలాటం అనేది బృందగానంతో కూడిన లలితమైన బృంద నృత్యమన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు,శ్రీగౌరీ పరమేశ్వరీ అమృత వర్షిణి అధ్యక్షుడు పెతకంశెట్టి లక్ష్మీనారాయణ,కార్యదర్శి సుజాత, పలు కోలాటం గ్రూపుల మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఐఎఫ్‌పీ పాఠాలు

నక్కపల్లి : ప్రత్యేక అవసరాల గల పిల్లలకు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడం జరుగుతోందని గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ తెలిపారు. శనివారం ఆమె పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు స్మార్ట్ టీవీ ద్వారా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) విధానంలో విద్యాబోధన చేశారు. టీవీలో విజువల్స్ ద్వారా బోధన చేయడం జరుగుతోందన్నారు. ఈ ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం ప్రతి జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్మార్ట్‌టీవీని సరఫరా చేసిందన్నారు. మానసిక వికలాంగులు, తక్కువ దృష్టి కలిగిన వారు, మరగుజ్జు వారు, వినికిడి లోపం , పార్కిన్‌సన్ వ్యాధి కలిగిన వారు, దీర్ఘ కాలిక నరాల వ్యాధితో బాధపడే వారు, యాసిడ్ దాడి బాధితులు ఇలా 21 రకాల ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ప్రభుత్వం పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి స్మార్ట్ టీవీలు సరఫరా చేసి విద్యాబోధన చేస్తోందన్నారు. ఈ పాఠశాలలో ఇటువంటి వారికి ఈ టీవీలో ప్రత్యేకంగా రూపొందించిన విజువల్స్ ద్వారా దైనందిన కార్యక్రమాలు నేర్పిస్తూ వారిలో ఉన్న భయాన్ని పాగొట్టి పాఠశాలకు వచ్చేలా తయారు చేయడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు.